# సీక్రెట్

స్ప్రే కంటే వేగంగా స్ప్రెడయ్యిందా వార్త!

ఆ కాలనీలో ఏనోట విన్నా అదేమాట. ఎనిమిదవ వింతలా దాని గురించే గుసగుస.

అంతమందికి షాక్ కలిగించిన సదరు వార్తేంటంటే -

రయ్‌మంటూ స్ప్లెండర్ మీద దూసుకొచ్చాడు విజయ్. అతగాడలా రావటం మామూలంటే మామూలే! బట్ అతను మోసుకొచ్చిన మ్యాటర్ మాత్రం మోస్ట్ డిఫరెంట్ అండ్ ఇంటరెస్టింగ్.

"మన కరుణాకర్‌గాడు మొన్న చూసొచ్చిన అమ్మాయిని ఖాయం చేస్కున్నాట్ట. పైగా కానీ కట్నం లేకుండా పెళ్ళి చేస్కుంటున్నాట్ట" బైక్ దిగి మిస్సైలా రమేశ్ చెవిలోకి ఫూట్ చేసాడు విజయ్.

అది విని అదరిపడ్డాడా రమేశ్.

క్షణకాలం కూర్చున్న కుర్చీలో బిర్రబిగుసుకుపోయాడలాగే.

"మరి, వాళ్ళ నాన్న... అదేదో సిన్మాలో కోట శ్రీనివాసరావుకంటే యమ పిసినారి కదా! ఆయనెలా ఒప్పుకున్నట్టు?" ఎలాగో గొంతు పెగుల్చుకుని అడిగాడు రమేశ్.

కట్నం లేకుండా కరుణాకర్ పెళ్ళి చేసుకోబోతున్నాడనే విషయం రమేశ్‌కి మింగుడుపడడం లేదు.

"అందుకే తనే అన్నాడు మళ్ళీ..."

"కట్నం తీసుకుంటే కాళ్ళేస్తామని రాత్రికి రాత్రే నక్సలైట్స్ గానీ బెదిరించలేదు కదా?"

"ఏమో గురూ!"

"అమ్మాయి సౌందర్యలా వుండాలి, డిగ్రీ పాసవ్వాలి, మూడు లకారాలైనా ఇవ్వాలి. ఇవికదా మనవాడి మ్యారేజ్ డిమాండ్స్ అలాంటిది ఇంత సడెన్‌గా మంచోడైపోయాడేంట్రా?" జుట్టు పీక్కున్నాడు విజయ్.

ఒక్క నిముషం ఇద్దరిమధ్యా టెన్షన్‌తో కూడిన నిశ్శబ్దం.

"ఓ పన్జేద్దాం మనం తలలు బద్దలు కొట్టుకోవడం దేనికి? సరాసరి వెళ్ళి వాడ్నే అడిగేద్దాం. ఏంట్రా ఈ సీక్రెట్ అని"

"వెరీగుడ్ ఐడియా"

"పెళ్ళి సెటిలవుతే పార్టీ కూడా ఇస్తానన్నాడు. అదీ అడిగేద్దాం" అంటూ గబగబా డ్రెస్సేప్పి వచ్చాడు రమేశ్.

రమేశ్‌ని వెనకేసుకొని విజయ్ బైక్‌ని కరుణాకర్ ఇంటివైపు పోనిచ్చాడు.

***

ఫ్రెండ్సిద్దర్నీ చూస్తూనే "ఏంట్రోయ్! చెప్పాపెట్టకుండా వేంచేసారు. ఏంటీ ఏవైనా ప్రోగ్రామ్స్ చేసుకొచ్చారా?" ఉత్సాహంగా అడిగాడు కరుణాకర్.

బదులుగా "కంగ్రాట్స్‌గురూ!" అన్నారిద్దరూ ఒకేసారి.

"సారీరా! మీకు చెప్పనే లేదు. పోనీ తెల్సిందిగా, మొన్న మీకు ఫోటో చూపించా చూడండి, ఆ అమ్మాయి గీతాంజలితో మ్యారేజ్ ఫిక్సయ్యింది" చెబుతోంటే కరుణాకర్ కళ్ళలోకి చేరిన వెలుగు స్పష్టంగా కనిపిస్తోందిద్దరికి.

"సారీలు... పార్టీలు... ఇవన్నీ తర్వాతగానీ ముందీ విషయం చెప్పరా! టెన్షన్‌తో చస్తున్నారందరూ" అన్నాడు రమేశ్.

ఏవిటా విషయమన్నట్లు చూసాడు కరుణాకర్.

"పైసా కట్నం లేకుండా పెళ్లి చేస్కుంటున్నావంట. కరుణాకరంగాడు డౌరీ లేకుండా పెళ్లి చేసుకోవడమేంటాని ఫ్రెండ్సంతా ఆశ్చర్యపోతున్నారు. మీ నాన్నగానీ రాజకీయాల్లోకి రావటం లేదుకదా అని జనమంతా విస్తుపోతున్నారు" బదులిచ్చాడు విజయ్.

"నిజమేనా?" అడిగాడు రమేశ్.

"ఓ అదా! మీరు విన్న విషయంలో సందేహం లేదు. నిజమే! కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటున్నాను" నవ్వుతూ చెప్పాడు కరుణాకర్.

"మరి..?"

రమేశ్ మాట పూర్తి కానేలేదు.

"గీతాంజలి వాళ్ళ తల్లిదండ్రులకి ఒక్కతే అమ్మాయి. మగపిల్లల్లేరు. మంచి ఆస్తిపరులు. భవిష్యత్‌లో వాళ్ళ ప్రాపర్టీ అంతా నాకే చెందుతుంది. అదీ విషయం" చెప్పాడు కరుణాకర్.

అది విని "వార్నీ" అనుకుంటూ ధామ్మని విరుచుకుపడిపోయారిద్దరూ.

**(5.7.2001)**

*